సాక్షి చిత్తూరు

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



ఆరు దశాబ్దాల కల సాకారం

పుంగనూరు–బెంగళూరు రహదారి అభివృద్ధి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాకారమైంది.

- 8లో



కల్లూరు మండలంలో భారీ వర్షం

కల్లూరు మండలంలో 64.4 మిల్లి మీటర్ల వర్షం కురిసింది. గార్గేయనదికి జలకళ వచ్చింది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	24
తిరుపతి	33	25
తిరుమల	28	21
గూడూరు	34	27
నగరి	34	25

న్యూస్‌రీల్

భక్తసంద్రంగా బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మతల్లి దీవెనల కోసం భక్తులు ఆదివారం పోటెత్తారు. క్యూలన్నీ భక్తులతో రద్దీగా మారాయి. బోయకొండలో ఎటుచూసినా భక్తజన సందడి కనిపించింది. ఉదయం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అలంకరణల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దర్శనానికి భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో వచ్చి మొక్కులు చెల్లించారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

3 టన్నుల కూరగాయల వితరణ



కూరగాయలను అందిస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రం హొసూరుకు చెందిన మిత్ర బృందం 3 టన్నుల కూరగాయలను వితరణగా అందించింది. ఆదివారం ఉదయం హొసూరుకు చెందిన గోపాల్ రెడ్డి, మిత్ర బృందం సేకరించిన 3టన్నుల కూరగాయలను ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు సమక్షంలో అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పంద న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రి జర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని ఎస్పీ తెలిపారు.

విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం



స్వర్ణోత్సవ ర్యాలీలో యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆ సంఘం స్వర్ణోత్సవ ప్రచార జాతా బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ అమలుకు ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. యూటీఎఫ్ 50వ వసంతంలో అడుగుపెట్టిన నేపథ్యంలో అక్టోబర్ 1న విజయవాడలో స్వర్ణోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవంతం చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, జీవీ రమణ, రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతి రెడ్డి, ఎస్ఎస్ నాయుడు, సుధాకర్ రెడ్డి, మునిరత్నం పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష

పైలెట్ హెల్త్ క్యాంప్ రేపు

చిత్తూరు రూరల్: ఈనెల 30వ తేదీ నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెగా హెల్త్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం తిమ్మోజుపల్లెలో పైలెట్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ తుంబకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మోజుపల్లె మండల ప్రాథమిక పాఠశాలలో పైలెట్ హెల్త్ క్యాంప్ నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ క్యాంపును పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

బ్రహ్మాండోత్సవం



అశేష భక్తజన సందోహం నడుమ సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు





చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన వైకుంఠనాథుడు





తిరుగిరుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవం శోభాయమానంగా సాగుతోంది. సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన ఏడుకొండలస్వామిని దర్శించి భక్తకోటి పరవశించింది. బాల భాస్కరుని లేలేత కాంతుల్లో దేదీప్యమానంగా విరాజిల్లుతున్న దేవదేవుని సన్నిధిలో ప్రణమిల్లింది. ఉభయ దేవేరీ సమేతంగా సుగంధ పరిమళభరిత విశేష అభిషేకంలో సేదతీరిన మలయప్పను వీక్షించి పులకించింది. చల్లటి పిల్లగాలుల నడుమ చంద్రప్రభ వెలుగుల్లో దివ్యతేజస్సుతో అలరారుతున్న వైకుంఠనాథుని సేవించి తరించింది. శ్వేత వర్ణ కలువల అలంకరణలో కటాక్షించిన శ్రీమహావిష్ణువుకు దాసోహమంటూ నమస్సులర్పించింది.

- సూర్యప్రభ..చంద్రప్రభ వాహనాలపై విహరించిన శ్రీవారు
- తిరుమంజనంలో సేదతీరిన దేవదేవేరులు
- నేడు రథోత్సవం.. అశ్వవాహన సేవ
- రేపటి చక్రస్నానంతో ఉత్సవాలు పరిపూర్ణం

తిరుమల: తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. శ్రీవారికి ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహన సేవను వేడుకగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో మూడో స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం ఆలయం వెలుపల సహస్రదీపాలంకరణ సేవలో స్వామివారు ఊయలూగుతూ దర్శనమిచ్చారు. రాత్రి అశేష భక్త జన సందోహం నడుమ చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. మాడవీధుల్లో విహరిస్తున్న శ్రీవారి ఎదుట కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయంతోపాటు ఫల, పుష్ప ప్రదర్శనశాలలోని అలంకరణలు భక్తులను కట్టిపడేస్తున్నాయి. ఇక నాద నీరాజనం, ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న భక్తి, సంగీత కార్యక్రమాలు అలరించాయి. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

చక్రస్నానానికి పుష్కరిణిలో ఏర్పాట్లు

మంగళవారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఇందుకోసం పుష్కరిణిలో టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది.

నేడు రథోత్సవం.. అశ్వవాహన సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఉదయం 6.55 గంటలకు శ్రీవారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తేరును సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు అశ్వవాహనంపై మాడ వీధుల్లో విహరించనున్నారు.



సూర్యప్రభ వాహన సేవలో కళాకారుల ప్రదర్శన



వేంకటాపతి వైభవం చాటేలా కళా ప్రదర్శన



చంద్రప్రభ వాహన సేవలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన తదితరులు


గజ వాహనంపై గణనాథుని కటాక్షం

స్వయంభు శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి గజ వాహనంపై గణనాథుడు పురవీధుల్లో విహరించాడు. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణల అనంతరం గ్రామోత్సవం వేడుకగా జరిగింది. ఆదివారం సెలవురోజు కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీకాణిపాకం వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఆదివారం వేకువ జామున ఆలయంలో శ్రీస్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు చేసి, ప్రత్యేక అలకరణల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం సెలవురోజు కావడంతో స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. క్యూలన్నీ భక్తులతో కిటకిట లాడాయి. చంటి పిల్లలకు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు భక్తుల సౌకర్యాలపై పలు మార్లు పర్యవేక్షించారు. ఉదయం 10 గంటల సమయంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉభయదారులు, ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకు వచ్చి గజ వాహనంపై కొలువు దీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ముందు సాంస్కృతిక ప్రదర్శనలు సాగుతుండగా ..మంగళవాయిద్యాలు,మేళతాళాలు నడుమ ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. జై గణేష్ నామస్మరణలు మిన్నంటాయి. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.



గజ వాహనంపై విహరిస్తున్న గణనాథుడు



ముస్తాబైన రథం

నేడు రథోత్సవం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎంతో విశిష్టమైన రథోత్సవం సోమవారం జరుగనుంది. అశేషంగా విచ్చేసే భక్తులను దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆదివారం రథానికి అశ్వా లు, ద్వార పాలకులు, రాక్షసుల బొమ్మల ఏర్పాటు పనులను దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ అధికారులు పర్యవేక్షించారు. రథం విహరించే పురవీధులను అధికారులు, పోలీసులు పరిశీలించారు.

మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం

ఉదయం 9 గంటలకు రథం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ఆలయం వద్దకు తీసుకువస్తారు. అక్కడ భక్తులు పిండిదీపాలతో హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. రథానికి ముందు అశ్వాలు, వృషభాలు, విచిత్ర వేషాలు, వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలను దేవస్థానం ఏర్పాటు చేసింది.

లక్ష మంది వస్తారని అంచనా

రథోత్సవానికి సుమారు లక్ష మందికి పైగ భక్తులు వస్తారని అంచనా వేసినట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రసాదాలు సైతం అందరికీ అందేలా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

భారీ బందోబస్తు

రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో తనిఖీలు కూడా నిర్వహిస్తామన్నారు. ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 18 మంది ఎస్ఐలు, 150 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




త్రిశూల నాట్యం చేస్తున్న కళాకారిణి




రథోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు, దేవస్థానం అధికారులు

రెజ్లింగ్ జాతీయ పోటీలకు ఎంపిక



అంజలి, ధనుష్‌కుమార్(బంగారు పతకం)



మానస (కాంస్య పతకం)

పుత్తూరు రూరల్: రెజ్లింగ్ జాతీయస్థాయి పోటీలకు వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు కృష్ణా జిల్లా, నున్న గ్రామంలో జరిగిన అండర్–17, అండర్–14 బాలబాలికల రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రాతినిథ్యం వహించిన వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించి, జాతీయ పోటీలకు అర్హత సాధించారు. అంజలి 36 కిలోల విభాగంలో బంగారు పతకం, ధనుష్‌కుమార్ 110 కిలోలు గ్రీకో రోమన్ విభాగంలో బంగారు పతకం, యూనస్ 60 కిలోలు ఫ్రీస్టైల్ విభాగంలో రజతం, మానస 58 కిలోల విభాగంలో కాంస్య పతకాలను సాధించినట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. అంజలి అక్టోబర్ 3వ తేదీ నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్‌లో జరిగే జాతీయ పోటీలో, ధనుష్‌కుమార్ నవంబర్ మూడవ వారంలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం కరుణానవనీతం, ఉపాధ్యాయలు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

వృద్ధురాలిపై లైంగిక దాడి.. నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో 65 ఏళ్ల వృద్ధురాలిపై ఓ కామాంధుడు లైంగిక దాడి చేశాడు. అతన్ని చంపేద్దామని కత్తి పట్టుకున్న బాధితురాలు.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ఇష్టంలేక పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. చిత్తూరు నగరానికి చెందిన 65 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధురాలు శనివారం ఇంట్లో నిద్రిస్తోంది. పక్కింట్లో నివసించే షణ్ముగం (38) అర్ధరాత్రి 2 గంటల సమయంలో వృద్ధురాలి ఇంట్లో దూరి లైంగికదాడి చేశాడు. ఉదయం 4 గంటల ప్రాంతంలో పట్టరాని కోపంతో కత్తి తీసుకున్న వృద్ధురాలు ఆ దుర్మార్గుడిని చంపేద్దామనుకుంది. అలాచేస్తే తాను జైలుకు వెళతానని ఆలోచించి, జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి వృద్ధురాలిని వైద్య పరీక్షల నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆరు దశాబ్దాల కల సాకారం

అరు దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోని పుంగనూరు–బెంగళూరు రహదారి అభివృద్ధి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాకారమైంది. పుంగనూరు నియోజకవర్గంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో నిధులు మంజూరై, పనులు చురుగ్గా సాగుతున్నాయి. పునర్విభజన నేపథ్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి నియోజకవర్గ అభివృద్ధి పరుగులు తీస్తోంది. పుంగనూరు–బెంగళూరు రోడ్డును జాతీయ రహదారిగా మార్పు చేయించడంలో ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు.

- పుంగనూరు అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- పుంగనూరు–బెంగళూరు రోడ్డు విస్తరణ
- జాతీయ రహదారికి అనుసంధానం
- శరవేగంగా పుంగమ్మ చెరువు కట్ట విస్తరణ
- పుంగనూరు అభివృద్ధే ధ్యేయంగా మంత్రి పెద్దిరెడ్డి ప్రత్యేక చొరవ


పుంగమ్మ చెరువు కట్ట నుంచి వెళ్లే బెంగళూరు రోడ్డు


చెరువు కట్టకు సిమెంటు గోడల నిర్మాణం

పుంగనూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సిమెంటు, తారు రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ప్రధానంగా పుంగనూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు సుమారు 11 కిలో మీటర్ల రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చి తారు రోడ్డు వేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కోరిక మేరకు పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గానికి సీఎంగా ప్రత్యేక నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా పుంగనూరు–బెంగళూరు రహదారి పనులు మంజూరు చేశారు. అలాగే పుంగనూరు రోడ్డును కర్ణాటకలోని జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ.. నియోజకవర్గంలోని రొంపిచెర్ల వరకు రోడ్డు విస్తరణ కార్యక్రమాలకు రూ.కోట్లాది నిధులు విడుదల చేశారు. మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో పనులు చురుగ్గా చేపట్టారు.

1970 నుంచి..

ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, పుంగనూరు –బెంగళూరు రోడ్డును విస్తరించాలని, 1970లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పుంగనూరు పర్యటన సమయంలో జెడ్పీ చైర్మన్ టీఎన్. నాగిరెడ్డి విన్నవించారు. ఆ సమయంలో నిధుల కొరత ఉందని, త్వరలోనే పనులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆ హామీ అలాగే నిలిచిపోయింది. ఆనాటి నుంచి పుంగనూరు ప్రజల మొర ఆలకించిన వారు లేరు. ప్రమాదాలతో విలవిలాడుతున్నా రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. పుంగనూరును 30 ఏళ్లు పాలించిన ఒకే కుటుంబం ఈ రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించలేదు.

పెద్దిరెడ్డి రాకతో..


నియోజకవర్గాల పునర్విభజనలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి ఆయన ప్రణాళికబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తండ్రి, తనయుడు ఎంపీ మిథున్‌రెడ్డి కలసి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని కోరారు. మంజూరు సమయంలో రాజన్న ఆకస్మిక మృతితో ప్రతిపాదనలు ఆగిపోయాయి. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే బెంగళూరు రోడ్డు విస్తరణ పనులు మంజూరయ్యాయి.

ఇదీ అభివృద్ధి

పుంగనూరు–బెంగళూరు జాతీయ రహదారిగా మార్పు చేయించడంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి కీలకపాత్ర పోషించి కేంద్ర ప్రభుత్వంలో అనుమతులు పొందారు. పుంగనూరు నుంచి కర్ణాటక సరిహద్దుకు సుమారు 11 కిలో మీటర్ల రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చి నూతనంగా తారురోడ్డు వేశారు. అలాగే పుంగమ్మ చెరువు కట్టను డబుల్ రోడ్డుగా మార్చారు. చెరువు కట్ట నుంచి రామసముద్రం వెళ్లేందుకు కట్టపై మరో నూతన రహదారిని ఏర్పాటు చేసి సర్కిల్ ఏర్పాటు చేశారు. చెరువు కట్టకు ఒక వైపు సిమెంటు కాంక్రీట్ గోడలు నిర్మిస్తూ, రోడ్డును 100 అడుగుల వెడల్పుతో విస్తరించే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అలాగే 50 రాళ్ల మొరవ వద్ద రెండు కల్వర్టులు, మార్లపల్లె, సింగిరిగుంట , అరవపల్లె వద్ద మూడు కల్వర్టులు నిర్మిస్తున్నారు. రూ.కోట్లాది నిధులతో చురుగ్గా సాగుతున్న పనులు మరో రెండు నెలల్లో పూర్తికానున్నాయి.


విస్తరించిన పుంగమ్మ చెరువు కట్ట

అభివృద్ధే లక్ష్యం



అన్ని ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రూ.కోట్లాది నిధులతో రోడ్లను ఏర్పాటు చేసి, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పుంగనూరు నియోజకవర్గంపై ఎంతో అభిమానంతో అడిగిన పనులన్నీ మంజూరు చేస్తున్నారు. 60 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోడ్డును అత్యంత సుందరంగా ఏర్పాటు చేసి, ఆదర్శవంతమైన పట్టణంగా రూపు రేఖలు మారుస్తున్నాం. అలాగే కట్టపై దీపాలు, పార్కు ఏర్పాటు చేస్తున్నాం. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సిమెంటు, తారు రోడ్లు వేసి, మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

– డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి

పుంగనూరుకు గుర్తింపు



రాజకీయ కక్షలతో అభివృద్ధికి నోచుకోని పుంగనూరు నియోజకవర్గానికి రాష్ట్రంలోనే గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. సీఎం జగనన్న ఆశీస్సులతో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం. 60 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని బెంగళూరు రోడ్డును విస్తరించి, జాతీయ రహదారికి అనుసంధానం చేశాం. ఆర్టీసీ డిపో ఏర్పాటు, బైపాస్‌రోడ్డు, మిని బైపాస్ రోడ్లు వేశాం. పుంగనూరులో ఆర్డీవో, ట్రాన్స్‌కో డీఈ కార్యాలయాలు ఏర్పాటు చేశాం. ఏరియా ఆస్పత్రిని నెలకొల్పాం. మరెన్నో కార్యక్రమాలను పూర్తి చేస్తాం.

– పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

'కాసు'కాదన్నారు...



1970లో ముఖ్యమంత్రిగా ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డిని రోడ్డు విస్తరణ చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. కానీ నిధులు లేవని కాదన్నారు. ఆనాటి నుంచి ఎంతమంది ముఖ్యమంత్రులకు రోడ్డు మరమ్మతులపై మొరపెట్టుకున్నా ఫలితం లేదు. నేను 70 సంవత్సరాలుగా చూడని, ఎవరు చేయలేని బృహత్తర కార్యక్రమాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమం చేపట్టిన ప్రభుత్వానికి, మంత్రి కుటుంబానికి ప్రజలందరి తరపున కృతజ్ఞతలు.

–పి.దక్షిణామూర్తి, మాజీ సర్పంచ్

మంత్రి పెద్దిరెడ్డితోనే అభివృద్ధి



పుంగనూరు నియోజకవర్గం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతోనే ఎంతో అభివృద్ధి చెందుతోంది. నిర్లక్ష్యానికి గురైన పుంగనూరును మంత్రి పెద్దిరెడ్డి అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నారు. పుంగమ్మ చెరువు కట్ట విస్తరణను ఇక నేను చూడలేనని అనుకున్నా. కానీ నా కోరిక నెరవేరింది. పట్టణం ఎంతో సుందరంగా అభివృద్ధి చెందుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, మంత్రికి రుణపడి ఉంటాం.

– పి.ఖాదర్‌ఖాన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

గంజాయి విక్రేతలు ముగ్గురి అరెస్టు

–రూ.2 లక్షల విలువైన సరుకు స్వాధీనం


నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ విశ్వనాథరెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంజాయి విక్రయాలపై దాడులు నిర్వహించి కె.మురుగన్ (56), ఎస్.ఉమాపతి (56), పి.వెంకటేష్ (32)ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం నిందితుల అరెస్టును చూపి, సీఐ విశ్వనాథరెడ్డి వివరాలను వెల్లడించారు. నగరంలో గంజాయి విక్రయాలపై నిఘా ఉంచామన్నారు. కట్టమంచి పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించగా రూ.2 లక్షల విలువైన 6 కిలోల గంజాయి లభించిందని తెలిపారు. చిత్తూరు దొడ్డిపల్లెకు చెందిన మురుగన్, కట్టమంచి రెడ్డి వీధికి చెందిన ఉమాపతి, పూతలపట్టు బండపల్లెకు చెందిన వెంకటేష్ ప్యాకెట్లుగా చేసి నగరంలో విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని గోవింద భక్తుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ రాజేష్

గుడిపాల: మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారి పల్లూరు ఆశ్రమం వద్ద బస్సు ఢీకొన్న ప్రమాదంలో గోవింద భక్తుడు ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్ఐ చలపతి కథనం మేరకు వివరాలు ఇలా.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కన్నియంబాడి తాలూకా పెరియపాలంబాక్కం గ్రామానికి చెందిన రాజేష్(20) గ్రామస్తులు 45మందితో కలిసి తిరుమల పాదయాత్రకు బయలుదేరాడు. ఆదివారం వేకువజామున 5గంటల ప్రాంతంలో మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారి పల్లూరు ఆశ్రమం వద్ద రాజేష్ నడుచుకుంటూ వెళుతుండగా తమిళనాడు ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం రాణిపేట సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు


గాయపడిన చిన్నారి యాదవ్

బైరెడ్డిపల్లె: పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని కైగల్ వంతెనపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. శాంతిపురంలో ఆదివారం నిర్వహించే సంతకు కేటిల్‌ఫాం నుంచి బొలేరో వాహనంలో పశువులను తీసుకొస్తున్నారు. కైగల్ వంతెన వద్ద బొలేరోను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సత్యంరాజు, కార్తీక్, వెంకటాచలం, రామచంద్ర, యాదవ్ తదితర ఎనిమిది మందికి గాయాలైయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం పలమనేరు ప్రభుత్వా స్పత్రికి తరలించారు. పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

రెజ్లింగ్ అండర్-14లో అదుర్స్


అండర్ -14 చాంపియన్‌షిప్పు సాధించిన కృష్ణ బాలుర జట్టు


అండర్-17 విశాఖపట్నం బాలికల విభాగంలో చాంపియన్‌షిప్పు సాధించిన జట్టు

- చాంపియన్ షిప్ కైవశం చేసుకున్న చిత్తూరు బాలికల జట్టు

విజయవాడ రూరల్: ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, నున్న వికాస్ కాలేజీలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధ్వర్యంలో మూడు రోజులు జరిగిన 67వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్–14, 17 విభాగాల బాలబాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో అండర్–14 బాలుర టైటిల్‌ను ఉమ్మడి కృష్ణా జిల్లా కైవసం చేసుకుంది. రెండు బంగారు పతకాలతో పాటు, నాలుగు రజిత, రెండు కాంస్య పతకాలతో బాలుర జట్టు 160 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకుంది. బాలికల విభాగంలో చిత్తూరు జట్టు చాంపియన్‌గా నిలవగా, అండర్–17 బాలుర టైటిల్‌ను నెల్లూరు జిల్లా, బాలికల చాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం జిల్లా గెలిచింది. హోరాహోరీగా సాగిన రెజ్లింగ్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో చాంపియన్‌షిప్‌లతో పాటు విజేతలకు పతకాలను వికాస్ విద్యాసంస్థల కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పరిశీలకులు రమేష్, రాజు టోర్నమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శులు టీ.విజయవర్మ, టీ.శ్రీలత, శాప్ రెజ్లింగ్ కోచ్ మనోహర్, ఏపీ రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు భూషణం, వ్యాయామ అధ్యాపకులు ఆనంద్, సీనియర్ కోచ్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కూలు ఆవరణలో పేలిన నాటుబాంబు

ఉలిక్కిపడిన కలమందలవారిపల్లె వాసులు


పాఠశాల వరండాలో రక్తపు మరకలు

సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ కలమందలవారిపల్లె ప్రాథమిక పాఠశాల వరండాలో శనివారం రాత్రి నాటుబాంబు పేలింది. భారీ పేలుడు శబ్దానికి గ్రామస్తులు ఉలిక్కిపడి పాఠశాల ప్రాంతానికి చేరుకోవడంతో అక్కడున్న వ్యక్తులు పరారయ్యారు. వరండాలో రక్తపు మరకలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో ఎస్ఐ వెంకట నరసింహులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. పక్కనే ఉన్న అటవీ ప్రాంతం వరకు రక్తపు మరకలు ఉండడాన్ని గుర్తించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ పులిచెర్ల మండలానికి చెందిన గంగరాజు, రాజశేఖర్ అడవి పందులు, పిల్లులను పట్టేందుకు టపాసుల్లోని నల్లమందును కలిపి ఉంటగా చుట్టి కలమందలవారిపల్లె స్కూల్ ఆవరణలోని కిటికీకి తగిలిస్తున్న క్రమంలో అది జారి పడి పేలిందని తెలిపారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సోమల మండలంలో భారీ వర్షం


గార్గేయనదికి జలకళ


నగరిలో కురుస్తున్న వర్షం

సోమల: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి గార్గేయ కాలువ ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల ప్రజలు కొంత మేర ఇబ్బందులకు గురయ్యారు. పెద్ద ఉప్పరపల్లె వద్ద రైతు విష్ణుకు చెందిన టమాట పంట నీట మునిగింది. మండలంలో 64.4 మిల్లి మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. కందూరు– కలికిరి మార్గంలో బ్రిడ్జి నిర్మిస్తున్న కారణంగా పక్కనే ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన కల్వర్ట్ ఈ వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు కొంతసేపు అంతరాయం కలిగింది. వల్లగట్ల మీదగా గల్లవారిపల్లెపై సోమలకు బస్సులను నడిపారు. చెరువులు, కుంటలు మోస్తరుగా నిండాయి.

నగరి మండలంలో..

నగరి : మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు గాలీవాన బీభత్సం సృష్టించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు.